క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడు రాధాకృష్ణ మృతి


రాధాకృష్ణ (ఫైల్)

జె.పంగులూరు: మండల పరిధిలోని అలవలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొనపాటి రాధాకృష్ణ (51) మంగళవారం గుండె పోటుతో చనిపోయాడు. రాధాకృష్ణ మృతదేహానికి ఏపీ శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజక వర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణచైతన్య మాట్లాడుతూ రాధకృష్ణ మృతి పార్టీకి తీరని లోటన్నారు. వైఎస్సార్ సీపీ పార్టీ ఆవిర్భవించిన నాటి నుంచి గ్రామంలో పార్టీలో క్రియా శీలకంగా పనిచేశారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు రాధకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. రాధాకృష్ణకు ఒక అమ్మాయి. అబ్బాయి ఉన్నారు. భార్య వరలక్ష్మి గ్రామంలోనే అంగన్ వాడీ టీచర్‌గా పనిచేస్తోంది. బుధవారం అలవలపాడు గ్రామంలోనే రాధాకృష్ణ అంత్య క్రియలు జరిగాయి.

వేసవి శిబిరంతో విజ్ఞానం


మాట్లాడుతున్న గ్రంథ పాలకుడు

అద్దంకి: గ్రంథాలయాల్లో విద్యార్థుల కోసం వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహించడం వలన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని గ్రంథపాలకుడు భాస్కరరెడ్డి అన్నారు. ఆయన బుధవారం సంతమాగులూరు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మూడో రోజు నిర్వహించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. కథలు చెప్పడం, చదివించడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ లింకులతో ప్రమాదం


మాట్లాడుతున్న ఎస్సై సమందర్ వలి

అద్దంకి: ఆన్‌లైన్‌లో పంపే లింకులను టచ్ చేస్తే మీ బ్యాంకు ఖాతాలు ఖాళీ అవుతాయని ఎస్సై సమందర్ వలి హెచ్చరించారు. గ్రామాల పర్యటనలో భాగంగా బుధవారం మండలంలోని తిమ్మాయపాలెంలో గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్‌లో మోసపూరిత మెసేజ్‌లు పెట్టి ఊరిస్తారని చెప్పారు. ఆ మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. వేసవిలో ఇంటి బయట పడుకునే సమయంలో దొంగలు సర్వం దోచుకుపోతారన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక ఆంగ్ల బోధన


శిక్షణ శిబిరంలో ఇంగ్లీష్ బోధిస్తున్న ఉపాధ్యాయులు

అద్దంకి రూరల్: అద్దంకి గ్రంథాలయంలో గ్రంథపాలకుడు చుండూరు సుగుణ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలోని బుధవారం సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజువీరు ఇంగ్లీష్ గ్రామర్, స్టోరీ టెల్లింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, మ్యాథమేటిక్స్ బోధించారు. రిటైర్డు బ్యాంక్ ఉద్యోగి తాళ్లూరి బాబూరావు నోట్ పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు పంచిపెట్టారు. మూడో రోజు శిబిరానికి 36 మంది పాల్గొన్నారు.

వేడుకగా వేణుగోపాల స్వామి కల్యాణం

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్ల సమీపంలోని రామదూత క్షేత్రంలో 11వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రామదూత క్షేత్ర నిర్వాహకులు, వేదపండితులు అకలంకం వెంకటరామకృష్ణా చార్యులు ఆధ్వర్యంలో హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శ్రీరుక్మిణి సత్యభామ సహిత శ్రీవేణుగోపాలకృష్ణస్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణ ఉభయ దాతలుగా ఎం.రమేష్‌బాబు, నివేదిత, జి.ఆంజనేయులు, మూర్తెమ్మ దంపతులు వ్యవహరించారు. ఉత్సవాలను గ్రామ ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తిలకించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నేడు వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామని, ఈ నెల 14వ తేదీతో సప్తాహ మహోత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు వెంకటరామకృష్ణ, యక్కంటి తిరుపతిరెడ్డి తెలిపారు.


కొత్తపేటలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణం


రోశయ్య కాలనీలో పైపులైను నిర్మాణ పనులు

ఎక్స్‌ప్రెస్ స్పీడ్

- అభివృద్ధి బాటలో కొత్తపేట
- రూ.658 లక్షలతో మౌలిక సదుపాయాలు
- అభివృద్ధిపై గ్రామస్తుల్లో ఆనందం

చీరాల: నియోజకవర్గం వేటపాలెం మండలం కొత్తపేట పంచాయతీలో చీరాల మున్సిపాలిటీలో కూడా కలిసి ఉంటుంది. ప్రస్తుతం ఇక్కడ అభివృద్ధి శర వేగంగా పుంజుకోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వివిధ వ్యాపారాల నిమిత్తం వచ్చిన వారు తమ పిల్లల చదువుల నిమిత్తం స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న వారు అధికంగా ఉంటారు. ప్రస్తుత అధికార లెక్కల ప్రకారం 19వేల మంది జనాభా, 16 వార్డులు, 5500 నివాస గృహాలు ఉన్నాయి. కాని గత ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధిపై చిన్నచూపు చూడడంతో కొత్తపేటలో మట్టి రోడ్లు, మంచి నీటి వసతి, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల వంటి సదుపాయాలు లేకపోవడంతో ప్రజలు నానా అవస్థలు పడేవారు. ప్రస్తుతం ప్రభుత్వం అభివృద్ధికి పెద్ద సంఖ్యలో నిధులు కేటాయించింది. సుమారు రూ.6.58 కోట్ల రూపాయలు నిధులు కేటాయించడంతో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి పైపులైను, సచివాలయాలు నిర్మిస్తున్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కొత్తపేట అభివృద్ధిలో ప్రత్యేక దృష్టి సారించారు. 14,15 ఆర్థిక సంఘ నిధులు, ఎమ్మెల్యే, ఎంపీ గ్రాంటు నిధులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ పథకం నిధులతో అభివృద్ధి పనులు ఎక్స్‌ప్రెస్ స్పీడ్‌లో జరుగుతున్నాయి.

పనులివే..

కొత్తపేట గ్రామ పంచాయతీ నుంచి వాడరేవు వరకు డబుల్ లైను రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. కొత్తపేట పంచాయితీలో రూ.346.47 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయింది. అలానే మరో రూ.286 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మాణం జరగాల్సి ఉంది. రోశయ్య కాలనీకి మంచినీటి పైపులైను నిర్మాణ పనులు రూ.14 లక్షలతో జరుగుతున్నాయి. మొత్తం 658.67లక్షలతో మౌలిక వసతుల పనులు జరుగుతున్నాయి.

కొత్తపేట అభివృద్ధి సంతోషకరం:



పట్టణానికి దగ్గర ఉన్నా మౌలిక వసతులు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి స్పందించి కొత్తపేటను అభివృద్ధి చేస్తున్నారు.

చుండూరి వాసు, మాజీ సర్పంచ్

వేగంగా చేస్తున్నారు:



గతంలో ఇవంటి అభివృద్ధి లేదు. దాదాపు అన్ని మట్టి రోడ్లుగానే ఉన్నాయి. అభివృద్ధి చెందుతున్న ప్రాంతం కావడంతో మౌలిక వసతుల కల్పనపై ఎమ్మెల్యే కరణం బలరాం దృష్టి సారించారు.

తాడివలస దేవరాజు

మరో ఏడాదిలో మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దుతా:



ఈ పంచాయితీ ఆదాయం మెరుగ్గా ఉన్నప్పటికి మౌలిక వసతులు ప్రజలకు అందడం లేదు. ఇప్పటికీ మట్టిరోడ్లు, అధ్వాన్న డ్రైనేజీ ఉండటంతో ఈ పంచాయితీపై ప్రత్యేక దృష్టి సారించాం. రూ. 6.58కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశాం. మరో ఏడాదిలో మోడల్ పంచాయతీగా తిర్చిదిద్దుతాం.

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూరి

విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తాం


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీపీ, ఎంపీడీఓ

మార్టూరు: మండలంలో విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ భుక్యా శాంతిభాయి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గత మూడు, నాలుగేళ్ళుగా మండలంలోని చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు జరిగిన దృష్ట్యా రోడ్లు ఎత్తుపెరిగి విద్యుత్ తీగలు కిందకు జారి ఉన్న నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు ఎక్కువగా ఇదే సమస్యను సమావేశంలో ప్రస్తావించారు. విద్యుత్ శాఖ తరపున హాజరైన సబ్ ఇంజినీర్ కిరణ్ మాట్లాడుతూ గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాల పునరుద్ధరణ, విద్యుత్ లైనులు ఎత్తు పెంచటం కోసం ఇప్పటికే మండలం మొత్తం మీద 150 స్తంభాలు మంజూరు అయినట్లు తెలిపారు. ముఖ్యంగా బొబ్బేపల్లి, ద్రోణాదులలో సమస్య తీవ్రత ఎక్కువగా ఉందని తెలిపారు. కోలలపూడి సర్పంచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ చిలకలూరిపేట నుంచి తమ గ్రామం మీదుగా గతంలో పంగులూరుకు తిప్పిన ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని, శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించాలని కోరగా సీడీపీఓ సుభద్ర పరిశీలించి తగు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎంఈఓ వస్రాం నాయక్, ఏపీఓ లక్ష్మీనారాయణ, వైద్య ఆరోగ్య శాఖ, వ్యవసాయ తదితర శాఖల అధికారులు మాట్లాడారు. ఎంపీడీఓ టీవీ కృష్ణకుమారి ఇతర అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఫిల్టర్ బెడ్ నిర్మాణానికి రోటరీ చేయూత


భూమిపూజలో పాల్గొన్న రోటరీ పాలకులు

ఆదిపూడి (కారంచేడు): ప్రభుత్వ పథకాలతో పాటు, స్వచ్ఛంద సంస్థల సహకారం గ్రామీణాభివృద్ధికి ఎంతో చేయూతనిస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ కారుమూడి సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం ఫిల్టర్‌బెడ్ భూమిపూజలో మాట్లాడారు. రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ పర్చూరు వారి సౌజన్యంతో సుమారు రూ. 5 లక్షలతో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామన్నారు. క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతు ఈ వాటర్ ప్లాంట్‌ను మరో 7 సంవత్సరాలు నిర్వహించాలని పంచాయతీ నుంచి వచ్చిన విన్నపం దృష్టిలో ఉంచుకొని రోటరీ క్లబ్ అనుబంధ సంస్థ అయిన సపోర్టు వారి సహకారంతోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. కార్యదర్శి సదానందరెడ్డి, పి. వెంకటేశ్వర్లు, సపోర్టు ప్రెసిడెంట్ పోలిశెట్టి చంద్రశేఖరరావు, కాసా అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వర్ణ చెరువులో చేపలు మృతి


స్వర్ణ చెరువులో చనిపోయి పైకి తేలుతున్న చేపలు

స్వర్ణ (కారంచేడు): మండలంలోని స్వర్ణ గ్రామపంచాయతీ పరిధిలోని తాగునీటి చెరువులో బుధవారం వేకువజామున చేపలు మృతి చెందాయి. దీంతో చేపలు చనిపోయి నీటిపై తేలాడంతో గమనించిన గ్రామస్తులు ఆందోళన చెందారు. నీరు కలుషితం కావడం వలన చనిపోయి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు తన సిబ్బందితో చనిపోయిన చేపలను పట్టించి ఊరు చివరన పారబోయించారు. తాగు నీటి చెరువులో నీరు కలుషితం కావడం వలన కాదని, వేసవి దృష్ట్యా ఆక్సిజన్ శాతం తక్కువగా ఉండటం వలనే ఈ చేపలు చనియోయాయని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని కార్యదర్శి అన్నారు. వెంటనే చెరువులో బ్లీచింగ్ చేయించామన్నారు. నీటిని పరీక్షల నిమిత్తం పంపిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు, మత్స్య శాఖ అధికారులకు కూడా తెలియజేశామన్నారు.

రాష్ట్ర హితం కోసమే శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి


మహాయజ్ఞం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చీరాల: రాష్ట్ర సంక్షేమం, అభివృద్ధి, ప్రజలు సుఖ శాంతులతో ఉండేందుకే ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ మహాయజ్ఞం కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల 12వ తేదీ శుక్రవారం నుంచి 17వ తేదీ వరకు విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో ఈ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. చండీ, రుద్ర, రాజశ్యామల సుదర్శన మహాలక్ష్మీ యజ్ఞాలను నిర్వహిస్తున్నారన్నారు. చీరాల ప్రాంతం నుంచి వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామీజీలు పాల్గొంటారన్నారు. అలానే రాష్ట్రంలో ఉన్న ప్రధాన దేవాలయాల్లోని దేవుని రథాలు కూడా ఇక్కడకు తీసుకువచ్చి భక్తుల సందర్శనార్థం ఉంచుతారన్నారు. పాల్గొనే భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు ఉన్నాయన్నారు. ఆర్డీఓ సరోజిని, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పానకాలరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, సీఐ మల్లిఖార్జునరావు, ఈవోలు జి.వి.ఎల్ కుమార్, వెంకటేశ్వరరావు, కామాక్షి హస్పిటల్ అధినేత తాడివలస దేవరాజు, మున్సిపల్ కౌన్సిలర్ బత్తుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నాగవరపమ్మ శిడి మహోత్సవానికి లగ్నం ఖరారు

చినగంజాం: వేటపాలెం మండలం రామన్నపేట శివారు రావూరి పేటలో వేంచేసియున్న శ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారి శిడి మహోత్సవ కార్యక్రమానికి బుధవారం లగ్నం ఖరారు చేశారు. మండలంలోని సంతరావూరు గిలకల మందిరంలో సిద్దాంతి డీకే సుబ్బారావు అమ్మవారి శిడి మహోత్సవంనకు లగ్నం నిర్ణయం చేశారు. సిద్దాంతి నిర్ణయించిన లగ్నం ప్రకారం ఈ నెల 26వ తేదీ అమ్మవారు నిధి మీదకు రానున్నట్లు అటు తరువాత ఐదు రోజులకు సంతరావూరు గ్రామంలో పలు కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఈ నెల 31వ తేదీ అమ్మవారి శిడిబండి బయలుదేరి రావూరి పేటలోని అమ్మవారి గుడికి చేరుతుందని, జూన్ 3వ తేదీ అమ్మవారి శిడి మహోత్సవం జరుగుతుందని ఎండోమెంట్ అధికారి జీవీఎల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.


నాగవరపమ్మ అమ్మవారి లగ్న పత్రిక అందుకుంటున్న నిర్వాహకులు

శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం జయప్రదం చేయాలి

యద్దనపూడి: విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు జరిగే చండీరుద్ర రాజశ్యామల సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు హాజరై జయప్రదం చేయాలని అద్దంకి ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ పి. శైలేంద్రకుమార్ అన్నారు. బుధవారం పూనూరు ఎండోమెంట్ కార్యాలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం కరపత్రాలను గ్రామంలో అందరికీ అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా అభివృద్ధి పథంలో నడవాలని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఎండోమెంట్ ఈఓ జ్యోతి, రికార్డు అసిస్టెంట్ రామకృష్ణ, అర్చకులు భావనాచార్యులు, రాజ్‌కుమార్ శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ కొలుపులు

బల్లికురవ: బల్లికురవలోని గ్రామ దేవత పోలేరమ్మ కొలుపులు 6 రోజులుగా కనుల పండువగా నిర్వహిస్తున్నారు. గత శుక్రవారం గటంతో కొలుపులకు అంకురార్పణ చేశారు. బుధవారం గ్రామ దేవత మహాలక్ష్మమ్మకు గ్రామోత్సవంతో పానకం, వడపప్పు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామాన్ని ఎల్లవేళలా కాపాడాలని గ్రామ దేవతలను ప్రార్థించారు. గ్రామం చుట్టూ ఉన్న గమిడి రాళ్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. వ్యవసాయ పనులకు రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లిన రైతులు వ్యవసాయ కూలీలు కొలుపులు సందర్భంగా గ్రామానికి చేరటం బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండగ వాతావరణం నెలకొంది. ఆదివారం అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.


బల్లికురవలో గ్రామోత్సవం


మహాలక్ష్మమ్మచెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళా భక్తులు


లగ్నం ఖరారు చేసేందుకు సమావేశం అయిన గ్రామ పెద్దలు


మాట్లాడుతున్న ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ శైలేంద్ర, ఈఓ జ్యోతి

కళాకారులకు సత్కారం


రంగస్థల కళాకారులకు వస్త్రాలు అందజేస్తున్న ప్రవీణ్

అద్దంకి: రోటరీ క్లబ్‌ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో సినీ నేపథ్య గాయకుడు కొప్పోలు ప్రవీణ్ సౌజన్యంతో చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అన్నదానంతోపాటు, రంగస్థల కళాకారులకు వస్త్రాలు బహూకరించారు. వీటిని ప్రముఖ రంగస్థల నటుడు కొప్పోలు శ్రీరాములు (బిత్రగుంట రామారావు) వర్ధంతి సందర్భంగా ప్రవీణ్ అందజేశారు. దీనిలో భాగంగా శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాములు అల్లుడు ఏజీపీ వై. రమేశ్, రోటరీ అధ్యక్షుడు సంది రెడ్డి శ్రీనివాసరావు, బీవీ కృష్ణారెడ్డి, వీరవల్లి సుబ్బారావు, తమ్మన శ్రీనివాసరావు, గాడేపల్లి దివాకర దత్తు, పీఎల్ఎన్‌ప్రసాద్, రోటరీ సభ్యులు ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ముగిసిన సమ్మర్ కిడ్స్ క్యాంపు

అద్దంకి రూరల్: జన విజ్ఞాన వేదిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో గత వారం నుంచి నిర్వహిస్తున్న సమ్మర్ కిడ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. జన విజ్ఞాన ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ సృజనాత్మకతను వెలికి తీసే కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. జె.వి.వి. గౌరవాధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు బహుమతులు అందజేశారు. డివిజన్ కార్యదర్శిగా శ్రీనివాసరావు, కె. రఘు చంద్, జి. వెంకటరావు, పోతురాజు, తంగిరాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలేటి రామారావు కార్యాలయం ప్రారంభం

చీరాల: మాజీ మంత్రి, డాక్టర్ పాలేటి రామారావు బుధవారం స్థానిక గడియార స్తంభం సెంటర్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో తన సొంత పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజలు ఏ సమస్యలను అధికారులు, రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడి పరిష్కారిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చేనేతలకు పవర్ సబ్సిడీ


మాట్లాడుతున్న డీఈ సూర్యప్రకాష్, బీరక సురేంద్ర

చీరాల అర్బన్: చేనేతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వంద యూనిట్ల పవర్ సబ్సిడీ అందిస్తున్నారని, అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలని దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని దేవాంగపురి పంచాయతీలో ఎలక్ట్రికల్ డీఈ, ఏఈలతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలకు పెట్టుబడి సాయం కింద నేతన్న నేస్తంతో సంవత్సరానికి రూ. 24 వేల చొప్పున నాలుగు దఫాలుగా రూ.96 వేలు అందిచారన్నారు. ప్రస్తుతం మగ్గం ఉన్న ప్రతి ఒక్కరికీ నెలకు 100 యూనిట్ల సబ్సిడీ అందిస్తున్నారన్నారు. దరఖాస్తులను కార్పొరేషన్ తరపున అందిస్తారని, అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎలక్ట్రికల్ డీఈ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కార్పొరేషన్ నిర్వహణలో చేనేతలకు 100 యూనిట్ల వరకు విద్యుత్ సబ్సిడీ ఇవ్వడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. అర్హులైనవారందరూ కార్పొరేషన్ సహకారంతో లబ్ధి పొందాలన్నారు. అధికారులు శ్రీనివాసరావు, చేనేత నాయకులు బీరక సురేష్, నాగేశ్వరరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కో ఆపరేటివ్ సొసైటీ మహాజన సభ

చినగంజాం: స్థానిక చినగంజాం కో ఆపరేటివ్ కలెక్టివ్ ఫార్మింగ్ సొసైటీ మహాజన సభ బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. సొసైటీని రద్దు చేసే కార్యక్రమంలో భాగంగా సీనియర్ ఇన్‌స్పెక్టర్ నూతలపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించగా సొసైటీకి సంబంధించిన 170 మంది సభ్యులలో 85 మంది మహాజన సభకు హాజరయ్యారు. సభ్యుల ఆధార్ కార్డులు, ఇతర అర్హత పత్రాలను పరిశీలించి స్వీకరించారు. 170 మందికి పట్టాలు అందజేయాలని వినతి పత్రాన్ని ఇన్‌స్పెక్టర్‌కు అందజేశారు.

అంకమ్మ చౌదరికి నివాళులర్పించిన రామనాథం బాబు


ప్రభాకరరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రామనాథం బాబు

పర్చూరు (చినగంజాం): మండలంలోని బోడవాడ గ్రామ మాజీ సొసైటీ అధ్యక్షుడు తేలప్రోలు అంకమ్మచౌదరి హఠాన్మరణం చెందడంతో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ రావి రామ నాథం బాబు బుధవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. దీంతోపాటు నూతలపాడులో వణకూరి ప్రభాకరరెడ్డి తల్లి సామ్రాజ్యం మృతి చెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. వై. హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.